క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ



పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదాసు సత్యానందం వర్ధంతి సందర్భంగా గ్రామ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా సత్యానందం విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను మాజీ సర్పంచ్ లంకపోతు పిచ్చిరెడ్డి కొనియాడారు. అనంతరం మాదాసు భీమానందం గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైద్యశాలకు ఐరన్ మంచం, 10 కుర్చీలు అందజేశారు. అనంతరం బ్రాహ్మణ కోడూరులోని అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

బాజీబాబా దర్గాలో పరిశుభ్రతకు ప్రాధాన్యం

పెదకాకాని: స్థానిక బాజీ బాబా దర్గా ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా అన్నారు. సోమవారం మంగళగిరికి చెందిన షేక్ నూర్ అహ్మద్ దర్గా పరిశుభ్రతకు వినియోగించేందుకు విరాళంగా ఇచ్చిన రిక్షాతో పాటుగా దర్గాపాలకవర్గం ఇటీవల కొనుగోలు చేసిన రెండు రిక్షాలను ప్రారంభించారు. ఈఓ షేక్ ముక్తార్ బాషా మాట్లాడుతూ పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ సాహిద్ ఔలియా దర్గాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దర్గా ప్రాంగణంలో పారిశుద్ధ్య మెరుగునకు రూ. 54,000 విలువైన రెండు రిక్షాలతో పాటుగా దాత విరాళంగా ఇచ్చిన మూడో రిక్షాను కూడా కార్మికులకు అప్పగించామన్నారు. ఈసందర్భంగా దాతలకు దర్గా ఈఓ ముక్తార్ బాషా కృతజ్ఞతలు తెలియజేశారు.

కోడి పందేల స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: కోడి పందేల స్థావరంపై దాడిచేసి పందెరాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం నగర శివారుల్లోని గోరంట్ల గ్రామం శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేయగా నలుగురు పందెంరాయుళ్లను, రూ.5,750 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

కార్తికం.. శివోహం

- ఘనంగా కార్తిక దీపోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన శైవాలయాలు



చేబ్రోలులో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న నాగేశ్వరస్వామి



వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శివలింగాకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులతో కిక్కిరిసిపోయింది. మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు శివలింగాకారంలో కార్తీక దీపోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ఆలయాల్లో భక్తులు, మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

వేడుకగా కార్తిక పౌర్ణమి పూజలు..

గుంటూరు రూరల్: కార్తిక మాసం పురస్కరించుకుని కార్తిక మాసం రెండవ సోమవారం, పౌర్ణమి సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించి సాయంత్రం వేళల్లో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న అగస్త్యేశ్వరాలయంలో తెల్లవారుజామునుంచి భక్తులు కిక్కిరిసిపోయారు. ఆలయంలో విశేషంగా రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, విశేష పుష్పాలంకరణలు చేశారు. స్వామివారికి పంచహారతులు అందించి ప్రత్యేక అలంకారం చేసి స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం దీపాలంకరణ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు, ఇతర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నేడు వడ్లమూడిలో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ

చేబ్రోలు: దృష్టి లోపం కేవలం ఒక సమస్య మాత్రమే కాదని, మనిషికి, ప్రపంచానికి మధ్య అడ్డుగోడ వంటిదని, దీనిని పటాపంచలు చేసే దిశగా బజరంగ్ ఫౌండేషన్ నేత్ర జ్యోతి పేరిట నిర్విరామ కృషి చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోకాన్ని చూడగలిగే అవకాశం దేవుడు అందరికీ ఇచ్చినా, అనేక కారణాలతో చాలా మంది ప్రజలు నేత్ర సమస్యల లోపాలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్థోమత లేని వెనుకబడిన వర్గాల ప్రజానీకం నేత్ర సమస్యలతోనే జీవితాన్ని ఈడుస్తున్నారని, ఇంకొందరు వైద్యం గురించి సరైన అవగాహన, చికిత్స విధానం గురించి తెలీక ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితుల్ని అధ్యయనం చేసిన బజరంగ్ నేత్ర జ్యోతికి శ్రీకారం చుట్టిందన్నారు. పేదలు ఎక్కడ ఉండే, వారికి అక్కడే వారి ముంగిటకే నేత్ర జ్యోతి శిబిరాల ద్వారా వైద్య పరీక్షలను జరిపించామన్నారు. అనంతరం వైద్య సేవలను సైతం వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా వారి గ్రామంలోనే సాదరంగా ఆహ్వానించి వారికి కళ్లజోళ్లను అందజేయటం జరుగుతుందన్నారు. నవంబర్ 19వ తేదీన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో నిర్వహించిన బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్ర జ్యోతి శిబిరంలో 917 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన 767మందికి వారి లోపం ఆధారంగా వ్యక్తిగత కళ్లజోళ్లను సిద్ధం చేశామని తెలిపారు. ఈ నెల 28 తేదీ మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు మహిళలకు, 5 గంటల ఉంచి 7 గంటల వరకు పురుషులకు వడ్లమూడి గ్రామంలో 767 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు. బజరంగ్ నేత్ర జ్యోతి శిబిరం ద్వారా కళ్లజోళ్ల ఆవశ్యకతను గుర్తించిబడిన వారు అందుబాటులో ఉండి తమ కళ్లజోళ్లను పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

నామమాత్రపు ఫీజులతో శిక్షణ అభినందనీయం



గ్రూప్-2 పోటీ పరీక్షలకు రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెదకాకాని: పేద నిరుద్యోగులకు నామమాత్రపు ఫీజులతో పోటీపరీక్షలకు శిక్షణను అందిస్తున్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కౌండిన్య ఐఏఎస్ అకాడమీ అవరణలో గ్రూప్-2 పోటీ పరీక్షలకు రూపొందించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి అకాడమీ ఫౌండర్ చైర్మన్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పోటీ పరీక్షలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే కానిస్టేబుల్ నుంచి కలెక్టర్ ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వటం ఎంతో కష్టతరమైన విషయమన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కులమతాలకతీతంగా ఎంతోమంది పేద నిరుద్యోగులు, చిరుఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.1.75కోట్లు స్కాలర్‌షిప్ రూపంలో అందజేయటం ప్రశంసనీయమన్నారు. ఈసందర్భంగా గ్రూప్-2 పోటీపరీక్షలకు రూపొందించిన పుస్తకాన్ని అవిష్కరించారు. కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిధులు వై.సత్యనారాయణ, పామర్తి సాంబశివరావు, బెల్లంకొండ సదాశివరావు, బొబ్బిళ్ల వెంకటేశ్వరరావు, వాకా రాంగోపాల్‌గౌడ్, జత్తెడ శ్రీనివాసరావు, వీరంకి రంగారావు, పాండి శివన్నారాయణలతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పెదనందిపాడు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని గొరిజవోలుగుంటపాలెం గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఖాశింపీరా మాట్లాడుతూ ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలు చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు విషం చిమ్ముతున్నాయని వాటిని ఎవరూ నమ్మవద్దని ఆయన సూచించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారని ఆయన తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో మనం మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు గెలిపించుకోవాలో అనే విషయాల గురించి ప్రజలకు వివరించారు. తొలుత గ్రామంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల బోర్డును అవిష్కరించారు. తదనంతరం వలంటీర్లకు సంక్షేమ ఫలాల కిట్లను అందజేశారు. సర్పంచ్ వజ్రాల కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ కమ్మ సాంబశివరావు, ఏబీపాలెం, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షులు కె.భూషయ్య, డి.నాగేశ్వరరావు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, పత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ కొండా కృష్ణారెడ్డి, పెదనందిపాడు సర్పంచ్ దాసరి పద్మారావు, ఉపసర్పంచ్ దివ్వి రాంబాబు, నాయకులు కాసు శ్రీనివాసరెడ్డి, అల్లడి వెంకటేశ్వర్లు, కారుమూరి పుష్పరాజ్, కట్టా సునీల్, గ్రామస్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఊటుకూరు కేవీకేకు ఉత్తమ పురస్కారం



ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రం పురస్కారాన్ని అందుకుంటున్న ఊటుకూరు కేవీకే అధికారులు

గుంటూరు రూరల్: ఉత్త పరిశోధనలు చేసి, రైతుల అభివృద్ధికి దోహదపడిన ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రానికి ఉత్తమ కేవీకే పురస్కారం లభించిందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎస్.శారదజయలక్ష్మి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నోవాటెల్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ న్యూట్రి సీరియల్స్ సదస్సు 5.0లో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రానికి విలువ ఆధారిత ఉత్పత్తులు, చిరుధాన్యాలను ప్రొత్సహించటం, తదితర కార్యక్రమాలకు ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా గుర్తింపు పురస్కారం లభించిందన్నారు. ఈ కార్యక్రమం న్యూట్రి హబ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న కేవీకే సిబ్బందికి వీసీ, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.


వికసిత్ భారత్ సంకల్పయాత్ర సదస్సులు



లబ్ధిదారుకు రేషన్ కార్డు అందజేస్తున్న ఎంపీడీఓ ఆదినారాయణ, డీఎల్‌డీఓ సుజాత

గుంటూరు రూరల్: దేశ, రాష్ట్రాభివృద్ధికి అందరం సమష్టిగా కృషిచేద్దామని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని చల్లావారిపాలెం, ఓబులునాయుడుపాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లావారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ దేశ, రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమచేస్తున్న ఏకైక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. నవరత్నాల పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందుతుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో దేశంలోనే ఎన్నడూ లేని విధంగా సమూల మార్పులు తెచ్చిన నాయకుడు మన జగనన్న అని తెలిపారు. అదేవిధంగా తురకపాలెం, వెంగళాయపాలెం, లాలుపురం, మల్లవరం, దాసుపాలెం, చిన పలకలూరు, తదితర గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆధార్ కార్డులు, పలు సంక్షేమ పథకాలను అందించారు. ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, ఓబులునాయుడుపాలెం సర్పంచ్ కేశం శ్రీలక్ష్మి, హరనాద్ (బాజీ), పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, యమున పాల్గొన్నారు.

స్కాలర్ షిప్ టెస్ట్ బ్రోచర్ విడుదల



బ్రోచర్ విడుదల చేస్తున్న వైవీ ఆంజనేయులు, సుజిత్

తాడికొండ: చలపతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఐఐటీ-జెఈఈ/నీట్ అకాడమీని 2023-24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నామని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. బ్రోచర్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ ఐఐటీ- జేఈఈ/నీట్ అకాడమీ ఆధ్వర్యంలో 10వ తరగతి, చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు 10 లక్షల ప్రైజ్ మనీతోపాటు 100 క్యాష్ అవార్డులను ప్రకటిస్తూ డిసెంబర్ 10న స్కాలర్ షిప్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. స్కాలర్‌షిప్ టెస్ట్‌కి సంబంధించిన సిలబస్, అవార్డుల వివరాలను తెలియపరిచే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 10వ తరగతి చదువవుతున్న విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఈ పరీక్షకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, ఇందుకోసం రిజిస్ట్రేషన్ తదితర వివరాలు బ్రోచర్‌లో ఇచ్చిన క్యూ ఆర్ కోడ్ లింక్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఇతర పూర్తి వివరాలకు 8886630340, 8886630341 నంబర్‌లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్, అకాడమీ డైరెక్టర్ గుంటుపల్లి శంకరరావు, మోతడక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



ప్రదర్శనలో జువాలజీ అంశాలను వివరిస్తున్న యూనివర్సిటీ విద్యార్థులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగంలో సోమవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో నంబూరు వివా స్కూలు విద్యార్థులు తిలకించారు. జువాలజీ ఉపయోగాలు, ప్రాముఖ్యత గురించి అధ్యాపకులు వివరించారు. విద్యార్థులకు సైన్స్ కోర్సులపై అవగాహన కల్పించడానికి వర్సిటీ కూడా ప్రదర్శనశాలను ఏర్పాటు చేయనున్నట్లు జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగాధిపతి, ఓఎస్‌డీ ఆచార్య కె. సునీత తెలిపారు. విద్యార్థులకు సైన్స్ కోర్సుల ప్రాముఖ్యతను జువాలజీ విద్యార్థులు వి. షణ్ముఖ కల్యాణ్, శివ కోటయ్య, రాజకుమార్ తదితరులు వివరించారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు ఆచార్య జి సింహాచలం, ఆచార్య వీరయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

పట్నంబజారు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 3వ డివిజన్ కార్పొరేటర్ పోలవరపు జ్యోతి ఆధ్వర్యంలో సోమవారం ఓటర్ నమోదు క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవటంతో పాటు మంచి ప్రభుత్వాన్ని ఎంచుకునేందుకు దాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వెంకటేశ్వరరావు, 15వ డివిజన్ కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

గాంధీ పార్కులో అదనంగా సిబ్బంది నియామకం

నెహ్రూనగర్: గాంధీ పార్కులో సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగే క్రమంలో మహిళల వివాదంపై నగర కమిషనర్ స్పందించారు. సెలవు రోజుల్లో పార్కు రద్దీ దృష్ట్యా అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సెల్ఫీ పాయింట్ల వద్ద ఫొటోలు దిగే సమయంలో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏడీహెచ్ రామారావును ఆదేశించారు. టికెట్ కౌంటర్ వద్ద మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.